ఆ యువకుడి గుండె దడదడలాడింది. భయంతో కుంచించుకుపోయాడు. సిఫిలిస్ గుడ్‌గాడ్, ఎంత భయంకరమైన వ్యాధి!?!

వాటిని యథాప్రకారం వుంచాడు.

ఆ అమ్మాయి తిరిగివచ్చి, అతనివంక చూసి అలటికగా నవ్వి మళ్ళీ వుత్తరములో మునిగిపోయింది అతని కోరిక అణగిపోయింది.

రైలు ఆగింది తర్వాత ఆ అమ్మాయి ఏర్‌బేగ్‌తో రైలు దిగింది గర్వంగా. ఆ వుత్తరాన్ని ఆ యువకుడి మీదకు విసిరి గేటువైపు నడిచింది ఆ యువకుడు ఆ వుత్తరాన్ని, సంభ్రమంగా అందుకొని చదివాడు. దాంట్లో ఆ తర్వాత ఇలా వుంది.

"నువు చదవాలనే ఈ వుత్తరం వదలి బయటకు వెళ్ళాను. నాకు సిఫిలిస్ అనే సుఖవ్యాధి వుందనే భ్రమతో నన్నేంచేయలేదు నీవు. నా ఎత్తు పారింది నిజానికి నేనింకా కన్యనే. నాకే వ్యాధీలేదు నా ప్రాణాలమీద పందెం కావాలంటే"

# ప్రియ బాంధవి

"మా అమ్మాయి కనబడటంలేదు" చెప్పింది ఆవిడ. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ ఆ దంపతుల వేపు పరిశీలనగా చూశాడు. ఆయన వయస్సు యాభై దాటుతూండొచ్చని, ఆవిడ వయస్సు నలభై మూడు ఉండవచ్చని అంచనా వేసుకున్నాడు మనస్సులో.

"ఎప్పటినించి?" అడిగాడు.

"నిన్న ఉదయం నించి" చెప్పాడాయన.

ఇద్దరి మొహాల్లో ఆవేదన కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

"పూర్తిగా చెప్పండి"

"మా అమ్మాయి "హేపీ అవర్స్" అనే చిన్న పిల్లల స్కూల్లో టీచర్‌గా రెండు సంవత్సరాలుగా పనిచేస్తోంది. వయస్సు ఇరవై రెండు. నిన్న ఉదయం మామూలుగా స్కూలుకి బయలుదేరింది. సాయంత్రం అయిదున్నరకల్లా వచ్చేస్తుంది మామూలుగా. ఎనిమిదిన్నరయినా రాకపోతే కంగారువేసి స్కూలుకు వెళ్ళాం. ఉదయం అసలు స్కూలుకే రాలేదని తెలిసింది. ఇవాళ మధ్యాహ్నందాకా చూసి ఇక్కడికి వచ్చింది రిపోర్టు ఇవ్వడానికి."

ఇంద్రనీల్ మరోసారి ఆ అమ్మాయి ఫోటోవంక చూశాడు. అందంగా లేకపోయినా అనాకారి మాత్రం కాదు.

"పేరేమన్నారు?" అడిగాడు.

"ప్రియబాంధవి"

"ఈ మధ్య మీరు, మీ అమ్మాయి ఏ విషయంలోనయినా పోట్లాడుకున్నారా?"

"లేదు"

"తను ప్రేమించిన అబ్బాయిని చేసుకుంటానంటే మీరు కాదనటం లాంటివి...."

"లేదు" స్థిరంగా చెప్పారిద్దరూ

"యిదివరలో ఎప్పుడయినా కోపం వచ్చి, ఇల్లు విడిచి వెళ్ళటం జరిగిందా?"

"ఎప్పుడూ అలా జరగలేదు"

ఇంద్రనీల్ ప్రియబాంధవి పనిచేసే "హేపీ అవర్స్"కి వెళ్ళి విచారించాడు ప్రియబాంధవి చాలా మంచిపిల్ల, అందరితో సఖ్యతగా వుంటుంది. బోయ్‌ఫ్రెండ్స్ కాని, అప్పులుకానిలేవు. ఆమె మాయం అవడం అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తేసింది.

ప్రియబాంధవికి బాగా దగ్గరగా వుండే ఓ క్లోజ్‌ఫ్రెండ్‌ని అడిగాడు ఇంద్రనీల్.

"మీరు చెప్పే ప్రతి సమాధానం రహస్యంగా వుంచుతాను. నిజం చెప్పండి ప్రియబాంధవి ప్రేమలో పడిందికదా"

"జేమ్స్ అనే అతన్ని గత సంవత్సరన్నరగా ప్రేమిస్తున్నానని చెప్పిందోసారి"

"అతనెక్కడుంటాడు?"

"తెలియదు. నేను అడిగినా చెప్పలేదు"

ఆ సంగతి ప్రియబాంధవి తల్లిదండ్రుల దగ్గర ప్రస్తావించాడు ఇంద్రనీల్. జేమ్స్ పేరు వినగానే వాళ్ళమొహం పాలిపోయింది. ప్రియ బాంధవి తండ్రి త్వరగా తేరుకొని చెప్పాడు.

"నాలుగు నెలల్రకితం జేమ్స్‌గురించి మాతో చెప్పింది. మతాంతర వివాహానికి మేం సమ్మతించమని చెప్పాం. మళ్ళీ ఆ ప్రస్తావన రాకపోవ డంతో మా అమ్మాయి ఆ సంగతి మర్చిపోయిందనేభావిస్తున్నాం."

డిటెక్టివ్ ఇనస్పెక్టర్ ఇంద్రనీల్‌కు ప్రియబాంధవి మాయం అవటం గురించి ఎలాంటి క్లూ దొరకలేదు. వాళ్ళబంధువులందరినీ ప్రశ్నిం చాడు కాని పనికివచ్చే వివరాలేం లభ్యంకాలేదు. ఆమె మాయం అవటం అతనికి మిస్టరీగానే వుంది. కేసుని ఎన్ని రకాలుగా పరిశీలించినాఆ మిస్టరీని భేదించలేకపోయాడు.

వారం తర్వాత ఓసారి అటు వెళుతూ ప్రియబాంధవి ఇంటికి వెళ్ళాడు సందులో పోస్టుమేన్ ఎదురయ్యాడు. అతని చేతిలోని ఎయిర్ మెయిల్ కవర్, దాని చేతివ్రాత ఇంద్రనీల్ దృష్టిని ఆకర్షించాయి. దాన్ని తీసుకుని చిరునామా చూశాడు.

తను ప్రియబాంధవి పుస్తకాలలో చూసిన ఆమె చేతి వ్రాతే! కొన్ని క్షణాలు ఆలోచించి, చింపి చదివాడు.

విశాఖపట్నం,
18-3-1984

"అమ్మా, నాన్నలకు ప్రియ బాంధవి నమస్కరించి వ్రాయునది-

మీరు మొన్న రాసిన ఉత్తరం అందింది. నేను క్షేమం। అక్కడ అంతా కులాసా అని తలుస్తాను, ఉదయం డాక్టర్ దగ్గర చెకప్‌కి వెళ్ళాను మందులు రాసిచ్చారు। నాకు యిక్కడ బాగా బోర్‌గా వుంది. జవాబు రాయండి।

ప్రియబాంధవి

అయిదు నిమిషాల తర్వాత కన్నీళ్ళతో ఇంద్రనీల్‌కి వివరించింది ప్రియబాంధవి తల్లి!

"మోసపోయింది నాయనా, ఆ జేమ్స్ వల్ల గర్భవతయింది. నాలుగో నెలదాటాక కాని మాకు చెప్పలేదు. అబార్షన్ చేస్తే అసలుకే మోసం అన్నారు డాక్టర్లు. కాని ఎమ్మే దాక వైజాగులో వుంచి చదివించాం చుట్టుపక్కలవారికి, బంధువులకి ఏ కారణం చెప్పాలో తెలియక మాయమయిందని అబద్ధం చెప్పాం. మీకు రిపోర్టు ఇచ్చి అందర్నీ నమ్మించాం. దయచేసి మా గుట్టు రట్టు చేయకు నాయనా?"

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ మౌనంగా బయటకు నడిచాడు.

# తియ్యని చేదు

జీవితంలో ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకున్నా కొన్ని కొన్ని ప్లాన్స్‌కి వ్యతిరేకంగా జరుగుతాయి. కాని ఎలాంటి పథకం లేకుండా కొన్ని కొన్ని అకస్మాత్తుగా జరిగి పోతాయి.

కామేష్‌కి అనుకోకుండా ఆఫీస్‌టూర్ తగిలింది. ప్యూన్‌ని స్టేషన్‌కి పంపిస్తే వెంటనే మద్రాస్‌కి ఫస్టు క్లాస్ టికెట్ దొరికింది.